# శ్రీవారి ప్రేమలేఖ

కుసుమ

ఫోస్ట్!..అన్న కేకతో పుస్తకం చదువుతున్న రాజేశ్వరమ్మగారు గుమ్మంలో పడి వున్న కవరును తీసుకున్నారు.

అడ్రసు చూస్తే అది తనకే! తనకైతే "ఇంకెవరు రాస్తారు? ఆయనే అయుంటారు." అనుకున్నారు.

కవరు చించి ఉత్తరం చదువుకున్నారు. చదువుతూంటే ఆమె ముఖంపై చిరు చెమటలు పట్టాయి.

గదిలోకి వెళ్లి తిరిగ్గా మరోమారు ఆ ఉత్తరం చదువుకున్నారు. ఈ మారు ఆమెకి కంగారూ కలుగలేదు, చెమటలూ పట్టలేదు. పైగా పెదవులమీద చిరునవ్వు చిందులు వేసింది. ఉత్తరం మడిచి సూట్‌కేసులో భద్రపరుస్తూ, "ఈ వయసులో ఈయనకి ఈ తరహా ఉత్తరాలేమిటి? పైగా తను జవాబు కూడా వ్రాయాలట. వెళ్తున్నప్పుడు క్షేమ సమాచారములు తెలుపుతూ ఎప్పటికప్పుడు వుత్తరాలు రాయండి, అన్న మాట వాస్తవమే! ఆయనగారు కూడా తనని జవాబులు రాయమని మాటి తీసు కున్నారు కూడా. "బాబోయ్ నేను ఎవరికీ ఉత్తరాలేరాయను, చాకలి పద్దుకు తప్పించి మరి దేనికీ పెన్ను ముట్టనిదాన్ని, నేనేం రాస్తాను! మీ క్షేమ సమాచారములు తెలుపుతూ మీరే రాద్దురూ!" అంది తను.

శాస్త్రిగారితో ఆమె వివాహం 16వ ఏట జరిగింది. అప్పటికి ఆయన చదువు పూర్తిచేసి ఉద్యోగంలో చేరారు. అనుభవం, తెలివితేటలు, స్వయం కృషితో ఆయన అంచెలంచెలుగా ఒక పెద్ద కంపెనీకి "ఎమ్.డి."గా స్థిరపడ్డారు.

ఆయన అదృష్టమో ఏమోగానీ వున్న వూర్లోనే ఉద్యోగం. రాజేశ్వరమ్మగారి పుట్టిల్లు కూడా అదే వూరుకావడాన వారు ఇద్దరూ ఎప్పుడూ ఓ వారంకన్నా దూరంలో ఉండటం జరగలేదు. వారికి ఒక కూతురు, ఒక కొడుకు. కొడుకు U.K.లో పెళ్లి చేసుకొని సెటిల్ అయిపోయాడు. కూతురు నిర్మల హైదరాబాద్‌లో భర్త, ఇద్దరు పిల్లలతో వుంటోంది.

శాస్త్రిగారు రిటైర్ అయ్యాక మరొక పెద్ద ఫర్మ్‌లో అడ్వైజర్‌గా వుంటున్నారు. ఎప్పుడూ బిజీగా వుండే వ్యక్తి కావడాన ఖాళీగా గడపలేక ఇలా చేరారు.

వుద్యోగరీత్యా ఓ నెల రోజులు ఢిల్లీలో వుండవలసి వచ్చింది శాస్త్రిగారికి. అంతకుముందు ఎప్పుడైనా ఇలా పైవూరు వెళ్లాల్సివస్తే భార్యను కూడా తీసుకువెళ్లేవారు. ఈ మారు ఆమె ఆరోగ్యం అంతబాగుండకపోవడంవల్ల ఆమెని కూతురు దగ్గర హైదరాబాద్‌లో దించి వెళ్లారు.



"గణపతీ సమస్తు_భ్యామ్"

కె. బి. నాయుడు (ఎ. పి. ఓ. యు.) (టైపు చిత్రం)

గడియారపు గంటలతో ఆమె తేరుకుని వంటగదిలోకి ప్రవేశించేరు. నిర్మల కూడా ఆమె వెనుకే వంటింట్లోకి వచ్చింది. తల్లీ, కూతుళ్లు పనుల్లో పడిపోయారు.

టిఫిన్లు, రాత్రి భోజనాలు కూడా పూర్తయిపోయాయి.

అందరూ ఎవరి గదుల్లో వారు పడుకున్నారు.

రాజేశ్వరమ్మగారు మనుమల గదిలో వాళ్లకి కథలు చెప్తూ పడుకున్నారు. పిల్లలు కాసేపట్లోనే నిద్రలోకి ఒరిగిపోయారు. ఆమెకు మాత్రం ఎంత ప్రయత్నించినా నిద్రాదేవి కరుణించడంలేదు. మదిలో భర్త రాసిన వుత్తరమే మెదులుతోంది.

ఏనాటి ముచ్చట్లు అవన్నీ! తమ పెళ్లయిన కొత్తలో ఒక రోజు కోసం ఆయన పై వూరు వెళ్తే తను ఎంత ఏడ్చేసింది.

ఆ వియోగం ఎన్ని యుగాలవరకో అనిపించింది.

ఎర్రబడ్డ తన కళ్లను చూసి తన చిన్నాడబడుచు ఎంత ఆట పట్టించిందో!

పాతికేళ్లనాటి మధురస్మృతులు మదిలో ఇప్పుడే జరుగుతున్న అనుభూతి!

ఎప్పుడూ ఆఫీసు పని అంటూ బిజీగా వుండే ఆయన్ని, తనని పట్టించుకోడంలేదని ఈ మధ్య ఎంత సాధిస్తోంది!

దగ్గరగా వుంటే అనుభూతులు అంతర్గతంగా వుండిపోతాయి గాబోలు. ఆమె కళ్లు చెమర్చాయి.


ఆయన ఉత్తరానికి జవాబు రాయాలి! ఓ నిశ్చయానికొచ్చాక ఆమె మనసు కుదుటపడి నిద్రలోకి ఒరిగిపోయారు.

నాలుగు రోజులు గడిచాయి.

ఆ రోజు ఉదయం వంట చేస్తూ "నిర్మలా! ఓ కవరుంటే కావాలే! మీ నాన్నగారికి ఉత్తరం రాయాలి" అన్నారు.

"అమ్మా! కవర్లు అయిపోయాయి. సాయంత్రం మీ అల్లుడుగారితో చెప్పి రేపు తెప్పిస్తాలే. రాద్దుగాని. రెండు రోజుల క్రిందటే విశేషాలన్నీ నాన్నగారికి నేను రాసాను కదా! తాపీగా రాయొచ్చు."

రాజేశ్వరమ్మగారి మనసు చిన్నబుచ్చు-కుంది.



అప్పుడే నాలుగు రోజుల నుండి రాయా లనుకున్న వుత్తరాన్ని మనసులోనే రాసేసుకుంటున్నారు. ఇంకా పేపరు మీద పెట్టడానికి వీలు కుదరడంలేదు.

మరునాడు అల్లుడుగారు అలవాటు ప్రకారం కవర్లు తేవడం మరచిపోయారు. మాటిమాటికీ అడగాలన్నా గుర్తు చెయ్యాలన్నా మొహమాటం. నిర్మల ఏం అనుకుంటుంది.అమ్మకి రాసే విశేషాలువేరే ఏం వుంటాయి అనుకుంటుందేమో.

తను జవాబు రాయాలనుకుంటూ అప్పుడే పది రోజులు గడిచిపోయాయి.

ఆ రోజు పోస్టులో మళ్లా రెండు ఉత్తరాలు ఒకటి కూతురుకి, ఒకటి రాజేశ్వరమ్మగారికి వచ్చేయి.

ఆ రాత్రి పిల్లలకి అలవాటుగా కథలు చెప్పి నిద్రపుచ్చేక వుత్తరంరాయాలని సంకల్పించారు.

కాగితం, కలం కావాలికదా, అవి ఎక్కడ నుండి వస్తాయి? ఎదురుగా పిల్లలు హోం వర్క్ పూర్తిచేసి వదిలేసిన పుస్తకాలు పెన్ను కనిపించాయి. వాటిలోంచి ఓ రెండు కాగితాలు పెన్ను తీసుకొని రాయడానికుపక్రమించారు.

తీరా కాగితాలు పెన్ను పట్టుకుందేగాని అన్నీ సందేహాలే! ఏమని "అడ్రస్" చెయ్యాలి? ఇంట్లో అయితే "ఏమండీ" అంటుంది. మరి ఉత్తరంలో? "శ్రీవారికి" అని రాస్తే? అబ్బె. అదిఎబ్బెట్టుగా తోస్తోంది. ఇంకా వేరే ఏమైనా రాయాలన్నా మరీ పుస్తకాల భాషలా వుంది.

అఖరికి "ఏమండీ" అని రాయడానికే నిశ్చయించుకున్నారు. క్షేమ సమాచారములతో ప్రారంభించిన ఉత్తరం నమస్కారములతో ముగించి అయన కిష్టమైన పిలుపుతో సంతకంచేసి, ఓ మారు మొదటి నుండీ చదువుకున్నారు. ఆమెకి ఆశ్చర్యం వేసింది. తనేనా ఈ ఉత్తరం రాసింది అని.

మరునాడు ఎలాగైనా ఆ ఉత్తరం పోస్టు చేయించాలని జాగ్రత్తగా మడిచి పెట్లో చీరల మధ్య పెట్టేశారు.

* * * * *

ఆ రోజు శుక్రవారం. రాజేశ్వరమ్మగారు తలకి స్నానం చేశారు. పచ్చటి పసిమిరంగులో వున్న మొఖానికి చిటికెడు పసుపుతో మరి కాస్త ఛాయ వచ్చింది ఆమెకి. పట్టుచీర కట్టుకుని కాసంత కుంకుమతో, పూలసజ్జతో, దేముడి గదిలోకి వెళ్తున్న ఆమెకి బైట కారు ఆగిన శబ్దం అయి "ఎవరు వచ్చారు చెప్మా ఉదయమే!" అనుకుంటూ వాకిట్లోకి వచ్చేరు.

వచ్చిన వ్యక్తిని చూసి ఆమె ఆశ్చర్యానికీ, ఆనందానికీ అవధుల్లేకపోయాయి.

చిరునవ్వులు చిందిస్తున్న శాస్త్రిగారు.

"అలా చూస్తూ నిలబడిపోయావేం రాజీ! గేటు తెరు!" అన్న మాటలకి తేరుకుని "నిర్మలా! మీ నాన్నగారు అప్పుడే వచ్చేశారే!" అంటూ ఓ కేక పెట్టి గబగబ గేటు తెరిచారు.

"ఏం? తొందరగా వచ్చేశానా? పోనీ మళ్లీ వెళ్లిపోనా?" అనిచిలిపిగా నవ్వుతున్న శాస్త్రిగారి చేతిలో సూట్‌కేస్ అందుకుని,

"చాల్లెండి, మీరు, మీ హాస్యాలు. ఇంకా అనుకున్న ప్రకారం మీరు రావడానికి మరో వారం పడుతుందికదా! సడన్‌గా వచ్చేశారని అలా అన్నాను కానీ."

ఇంతలో నిర్మల "అదేంటి నాన్నగారు ఇలా సడన్‌గా వచ్చేశారు? మొన్న రాసిన లెటర్‌లో కూడా వచ్చేస్తున్నట్టు రాయలేదే!"

"అదేంటమ్మా! నువ్వుకూడా మీ అమ్మలాగే అడుగుతున్నావే! పని పూర్తఖపోయింది. వచ్చేశాను."

ముగ్గురు నవ్వులతో సామాన్లు తీసుకొని లోనికి వెళ్లేరు.

కాఫీలు, స్నానాలు, భోజనాలు, అల్లుడుగారితో పిచ్చాపాటీలు ముగిశాక, శాస్త్రిగారు డిక్లేర్ చేశారు, ఆ రాత్రి బండీకే భార్యను తీసుకొని తమ వూరికి వెళ్తున్నట్లు.

కూతురు, అల్లుడు, ఎంతపట్టుబట్టినా పనివుందనీ, అర్జంటుగా వెళ్లితీరాలని ఆ రాత్రి బండీకే బయలుదేరి వెళ్లిపోయారు.


ఉదయం ఎనిమిదిగంటలకల్లా ఇల్లు చేరుకున్నారు. తాళాలు తీసుకొని ఇంట్లో అడుగుపెట్టేసరికి ఇల్లంతా దుమ్ముతో నిండి వుంది. పని మనిషికి కబురు చేసి తనూ ఓ చీపురు పట్టుకొని పని ప్రారంభించేరు రాజేశ్వరమ్మగారు.

శాస్త్రిగారు స్నానం ముగించుకొని అలవాటు ప్రకారం అర్జంటు అంటూ కార్లో ఆఫీసుకు వెళ్ళిపోయారు.

రాజేశ్వరమ్మగారు పని మనిషికి బట్టలు వేసి వుతికించాలని పెట్టెలు తెరిచి ఒక్కొక్కటి తీస్తుంటే చీర మడతలలో తను పెట్టిన ఉత్తరం బైటపడింది.

"అయ్యో! ఈ ఉత్తరం అయనకు అందజేయకుండా అయిపోయిందే!" అనుకుని బాధపడ్డారు.

ఎలాగైనా ఈ లెటర్ అయనకి అందజేయాలి. పోనీ మామూలుగా చేతికిచ్చేస్తే! ఛ...ఛ...అ థ్రిల్ వుండదు. మరి ఎలా?



ఆమె మదిలో మెరుపులా ఒక ఆలోచన మెదిలింది. పనిమనిషిని కేకవేసి చకచక బట్టలు వేసేశారు.

* * * * *

శాస్త్రిగారు ఆఫీసు పని ముగించుకొని ఒంటిగంటకు భోజనానికి వచ్చారు. తీరిగ్గా ఇద్దరూ ఢిల్లీ కబుర్లు చెప్పుకుంటూ భోజనానికి ఉపక్రమించారు.

"ఏమైనా రాజీ- నీ చేతి వంట అమృతం అనుకో! ఇరవై రోజులు ఆ హోటల్ కూడు తినలేక ఎంత అవస్త పడ్డానో..ఎంత ఫైవ్ స్టార్ హోటల్ అయినా ఆ రుచులు, ఆ ఆర్టిఫిషియాలిటీ అవన్నీ నాకు పడవు సుమా...హాయిగా కమ్మగా మనింట్లో ఇలా ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ తిన్న ఆనందం ఎలా వస్తుంది చెప్పు." అన్నాడు.

"అవును మరి. మనకు వయసు మీరి పోతోంది. ఆ హోటల్ భోజనాలు ఏం పడతాయి చెప్పండి. అయినా ఈ మారు ఈ కాన్ఫరెన్సులు, మీటింగులు అంటూ పైవూళ్లకు వెళ్లే మాటైతే ఉద్యోగానికి రిజైన్ చేసేయండి" అన్నారు ఆమె.

ఆయన ఓ చిరునవ్వు నవ్వేసి "అన్నట్లు ...రాజీ.. నా వుత్తరాలకు జవాబు రాయలేదే ఒక్క ఉత్తరమేనా రాస్తావనుకున్నాను సుమా. అయినా మీ ఆడవాళ్లకి నలభై దాటగానే సెన్సాఫ్ హ్యూమర్, రొమాన్సు కొద్దిగా నైనా వుండవోయ్. ఎంతసేపూ పైవూరు వెళ్ళిన భర్తని భోజనం జాగ్రత్త, మందులు వేసుకోండి, నిద్ర సరిగా పొండి, ఇవేగానీ, మీరు ఇంకేం ఆలోచించరు. అవే జీవిత పరమావధి అయినట్టు."

"చాల్లెండి. ఎవరేనా వింటే నవ్వగలరు. అరవై దాటుతున్నాయ్. సెన్సాఫ్ హ్యూమర్ టట, రొమాన్స్ టట, వెనకటికి మీలాంటి ముసలాణ్ణే, "తాతా పెళ్లాడుతావా" అంటే పిల్లనిచ్చేవాళ్లుంటే తప్పకుండా అన్నాట్ట బొక్కినోరు సవరించుకొంటూ, అలా వుంది మీ వరస."

"రాజీ..నువ్వు మరిచిపోయావు గాని.. ఆ రోజుల్లో మనం ఎలా వుండేవాళ్లం. నిన్ను వారానికి ఒక సినిమాకు తీసుకెళ్లకపోతే, ఎంత పేచీ పెట్టేదానివి. అలిగి సత్యాగ్రహం చేసేదానివి కాదూ! ఆ అలకలో అసలే చిన్నదైన నీ నోరు మరీ దమ్మిడీలా చేసేసి నన్ను గిలిగింతలు పెట్టేసేదానివి. బైటికెళ్లినప్పుడు నేను నీకు నచ్చినట్టు ట్రిమ్‌గా తయారవకపోతే

"మై క్యా కరో రాం....ముఝే బుడ్డా మిల్గయా.."అంటూ పాడేదానివి కాదూ! నీకు మాత్రం అప్పుడప్పుడు అవన్నీ గుర్తురావూ.... వయసు శరీరానికి గాని మనసుకి కాదు కదా"

ఇలా కబుర్లతో భోజనాలు ముగించుకొని అలసి వున్నారేమో బాగా నిద్రపోయారు.

* * * * *

మర్నాడు సాయంత్రం శాస్త్రిగారు ఆఫీసు నుండి వచ్చి సోఫాలో రిలాక్సయి, రాజీ... కాఫీ..అంటూ కేక వేశారు. కాఫీ కప్పుతో ఆమె వచ్చేరు.

కాఫీ తాగుతున్న శాస్త్రిగారి దృష్టి టీపాయ్ మీద నున్న కవరు పై పడింది.

"ఏమిటోయ్ ఏదో లెటరొచ్చినట్లుందే" అంటూ కాఫీ కప్పు ఆమెకి అందించేసి కవర్ ఓపెన్ చేసి చదవడం ప్రారంభించారు.

రాజేశ్వరమ్మగారు ఖాళీకప్పుతో కిచెన్‌లోకి వెళ్లిపోయారు.

లెటర్ చదవటం యాదాలాపంగా ప్రారంభించిన శాస్త్రిగారు, పై వాక్యాలు, సంబోధన చదివేసరికి ఒక్కమారు అలర్టుగా అయిపోయి చాలా శ్రద్ధగా చిరునవ్వులు చిందిస్తూ ఆ లేఖని చదవడం ముగించేరు.

వుత్తరం మడిచి కవర్లో పెట్టి నిశ్శబ్దంగా కిచెన్ వైపు అడుగులు వేసేరు.

సింక్‌లో కప్పులు కడుగుతున్న ఆమె భుజాలపై సున్నితమైన చేతుల స్పర్శ!

ఆమె ముఖం పదహారేళ్ల పిల్లలా సిగ్గుతో ఎర్రగా కందిపోయింది.

శాస్త్రిగారు ఆమెను తనవైపుకు తిప్పుకుని సున్నితంగా ఆమె ముఖం పైకెత్తారు.

"యూ....నాటీ గర్ల్...." అంటూ..

ఇద్దరికీ ఆపుకోలేనంత నవ్వు....

కళ్లంట నీళ్లు....

రెండు నిముషాల తరువాత ఆ ఉద్వేగం నుండి తేరుకున్నారు ఇద్దరూ.

శాస్త్రిగారు గంభీరంగా,

"రాజీ....ఈ రోజు ఈ ఆనందానికి కారణ మేమిటో తెలుసా? ఇన్నాళ్లకి నా గర్ల్ ఫ్రెండ్ దగ్గరనుండీ ప్రేమలేఖ అందుకున్నానోయ్!" అన్నారు.

"పోదురూ బడాయి! పదిహేను రోజుల క్రిందటనే నా బోయ్ ఫ్రెండ్ దగ్గర నుండీ నేనూ ఓ లెటర్ అందుకున్నాను." అన్నారు నవ్వుతూ.

ఇద్దరి నవ్వులతో వాకిట్లో వున్న పారిజాతాలు కూడా శృతి కలిపి వారి ఆనందాన్ని పంచుకున్నాయి. ●

## టి. వి. విశ్వామిత్రుడిగా భీష్ముడు



త్వరలో టి. వి. ద్వారా ప్రేక్షకులను అలరించబోతున్న 'విశ్వామిత్ర' సీరియల్ లో టైటిల్ పాత్రను 'మహాభారత్' లో గంగా తనయుడు భీష్ముడిగా నటిస్తున్న ముఖేష్ ఖన్నా పోషిస్తున్నాడట.

ప్రముఖ తెలుగు చలనచిత్ర దర్శకుడు డాక్టర్ దాసరి నారాయణరావు ఈ సీరియల్ కు నిర్మాత, దర్శకుడు కూడా.

ఒక్కొక్క భాగం 45 నిముషాల సేపు ప్రసారమయ్యే ఈ సీరియల్ ను 15 భాగాలుగా తీస్తున్నారు.

'మహాభారత్'లో భీష్ముడిగా తనదంటూ ఒక ప్రత్యేకమైన తరహాలో నటిస్తున్న ముఖేష్‌ఖన్నా, ఈ సీరియల్ లో తన పాత్రకు న్యాయం చేకూర్చగలడని ఆశిద్దాం!